19న 'ఆదిత్య'లో హెచ్‌సిఎల్ డ్రైవ్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం
రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సమాచార సాంకేతిక అకాడమీ, ఇంటర్మీడియట్ విద్యామండలి, హెచ్‌సిఎల్ ఆధ్వర్యాన ఈ నెల 19న ఆదిత్య డిగ్రీ కళాశాలలో హెచ్‌సిఎల్ డ్రైవ్ నిర్వహిస్తునట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. ఈ డ్రైవ్‌లో 2022-2023లో ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణలై ఎంపిసిలో 75 శాతం మార్కులు, గణితంలో 60 శాతం మార్కులు వచ్చిన వారు అర్హులన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఎంపికకు పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఉత్తీర్ణులైన వారికి ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ కల్పించి అనంతరం ఉద్యోగం కల్పిస్తారని తెలిపారు. డ్రైవ్‌కు హాజరయ్యే అభ్యర్థులు bit.ly.techbee22లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7901284277, 8309367771లో సంప్రదించాలని తెలిపారు.

మెడికల్ మాఫియా దందా

- విచ్చలవిడిగా మందుల దుకాణాలు
- అర్హత లేని సిబ్బందితో ఫార్మసీలు
- వైద్యుల చీటీ లేకుండా విక్రయాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి
జిల్లాలో మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది. అనుమతి లేకుండా ఫార్మసీలు నిర్వహిస్తూ ప్రజల నుంచి అందినకాడికి దోచుకుంటోంది. అనుమతి ఉన్న మెడికల్ షాపుల్లో అర్హతలేని సిబ్బందిని నియమించి కొనసాగిస్తున్నారు. జిల్లాలో అధికారికంగా సుమారు 220 మెడికల్ షాపులు ఉన్నట్లు సమాచారం. అనధికారికంగా మరో 100కి పైగా షాపులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం షాపుల్లో ఒక నెలకు రూ.కోటికి పైగా విలువైన మందులను విక్రయాలు జరుగుతున్నాయి. అత్యధిక వ్యాపారం రాజమహేంద్రవరంలో జరుగుగోంది. చుట్టుపక్కల మండలాల నుంచి వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ఆస్పత్రులను ఆశ్రయించటం పరిపాటి. వైద్యుల సూచన అనంతరం మందులు ఇక్కడే కొనుగోలు చేసి వెళ్తుంటారు. అనుమతి లేకుండా షాపులు నిర్వహిస్తూ విక్రయించిన మందులకు సైతం బిల్లులు ఇవ్వకుండా ప్రజల జేబులకు చిల్లువేస్తున్నారు. కొన్నిచోట్ల డాక్టర్ల చీటి లేకుండానే మందులు అమ్ముతున్నారు.

అనధికార షాపులపై చర్యలేవీ..?

జిల్లావ్యాప్తంగా సుమారు 220 మెడికల్ షాపులకు మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉన్నట్లు తెలుస్తోంది. క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు చాలా తేడాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 320 పైగా మెడికల్ షాపులు ఉన్నట్లు సమాచారం. ప్రధానంగా రాజమహేంద్రవరంలోనే 50 శాతం పైగా మెడికల్ షాపులు ఉన్నాయి. చాలా మెడికల్ షాపుల్లో అర్హత గల సిబ్బంది లేరనేది బహిరంగ రహస్యమే. ఫార్మసీ ఉత్తీర్ణత సాధించిన అర్హత గల వారి పేర్లపై షాపులకు అనుమతి తీసుకొని అర్హతలేని సిబ్బంది ద్వారా మందులను ప్రజలకు అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారిక షాపుల్లో సైతం చాలా వరకు అర్హతలేని సిబ్బందే మందులు విక్రయిస్తున్నారు. ప్రధాన మెడిసిన్‌లకు సంబంధించి సిబ్బందికి ప్రజలకు ఎలా విక్రయించాలో ముందే చెబుతున్నారు. దీంతో ప్రజలు ఆ మందులు వేసుకుని అనారోగ్యానికి గురవుతున్నారు.

డాక్టర్ల మందుల చీటి లేకుండానే..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం డాక్టర్ రాసిచ్చిన మందుల చీటటీ (మెడిసిన్ ప్రిస్కిప్షన్) ఆధారంగానే మందులను వినియోగదారునికి విక్రయించాల్సి ఉంటుంది. కానీ, జిల్లాలోని కొన్ని మెడికల్ షాపుల్లో ఇష్టారీతిన మందుల విక్రయం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డాక్టర్లు రాసిన మందులను ఇవ్వాల్సింది పోయి తమకు తోచిన మందులను రోగులకు ఇస్తూ వారి జీవితాలతో కొందరు షాపుల నిర్వాహకులు ఆడుకుంటున్నారు. విక్రయించిన ప్రతి డ్రగ్‌కు బిల్లు ఇవ్వాల్సి ఉండగా లేకుండానే అమ్మేస్తున్నారు. మరో వైపు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు మందులు అమ్ముతున్నట్లు ఆరోపణలున్నాయి. బిసి, సుగర్ వంటి వ్యాధులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరలకు మందులు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. డ్రగ్ కంట్రోలర్ అధికారులు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పరిశీలించి అనధికార వ్యాపారంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఫార్మసీ విభాగంలో జరుగుతున్న ఈ అక్రమాలపై వివరణ కోరేందుకు రాజమహేంద్రవరం డ్రగ్స్ విభాగం ఏడీని ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

విద్వేష రాజకీయాలను ఓడించిన

కన్నడ ప్రజలకు సిపిఎం అభినందన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం, నిడదవోలు
కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిని ఘోరంగా ఓడించిన కన్నడ ప్రజలకు సిపిఎం జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. బిజెపి నిరంకుశ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఇది ప్రజలు ఇచ్చిన తీర్పు అన్నారు. దేశ రాజకీయాల్లో ఈ ఫలితాలు ఒక మలుపు. కేంద్రంలో బిజెపి నిరంకుశ పాలనకు ఘోరీ కట్టడానికి కర్నాటక ఎన్నికల ఫలితాలే నాంది. ఇప్పటికే మహారాష్ట్రలో అనైతికంగా శివసేన ప్రభుత్వాన్ని కూల్చడంపై గవర్నర్, స్పీకర్‌లకు సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టింది. మన రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన తమ అవకాశవాదంతో బిజెపితో కలిసి అంటకాగుతున్నాయని, మోడీని ప్రసన్నం చేసుకోవడానికి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసే దాడులకు భయపడి ఏం చెప్పినా తాళం వేస్తున్నారని, రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే స్వప్రయోజనాలకే విలువిస్తున్నారని విమర్శించారు. కర్నాటక ఎన్నికల ఫలితాలతోనైనా ఈ పార్టీలు కళ్లు తెరవాలని, బిజెపి చేస్తున్న మోసాన్ని, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై నిలదీయాలని, రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు పూనుకోవాలని సూచించారు. మన రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపిని నిలదీయాలని ప్రజలకు పిలుపు ఇచ్చారు.

నిడదవోలులో సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు కన్నడ ప్రజలకు అభినందనలు తెలిపారు. బిజెపిని ఓడించినందుకు నిడదవోలులో స్వీట్లు పంచారు. కర్నాటకలో బిజెపి ఓటమిపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు బిజెపికి కొమ్ముకాయడం మానుకోవాలని, కన్నడ ప్రజలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గండి శ్రీనివాసరావు, ప్రసాద్, సతీష్, అంబేద్కర్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

విసిగా పద్మరాజు బాధ్యతల స్వీకరణ

విసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య పద్మరాజు

ప్రజాశక్తి-రాజానగరం
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఐదో విసిగా ఆచార్య కె.పద్మరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శనివారం యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఆచార్య కె.పద్మరాజుకు ఘనంగా స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయంలోని నన్నయ విగ్రహాలకు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పద్మరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌ఛార్జి విసి జివిఆర్.ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ సమక్షంలో కె.పద్మరాజు బాధ్యతలు స్వీకరించారు. నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అనుబంధ కళాశాలల యాజమాన్యాలు పద్మరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. తరువాత ఇసి హాల్లో ఇన్‌ఛార్జి విసిగా సేవలందించిన జెఎన్‌టియుకె విసి ప్రసాదరాజును నన్నయ విశ్వవిద్యాలయ అధికారులంతా సన్మానించి వీడ్కోలు తెలిపారు. అనంతరం పద్మరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు కతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహనరెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యపై చేస్తున్న ఖర్చును ఖర్చుగా కాకుండా రాష్ట్ర భవిష్యత్‌కు పెట్టుబడిగా భావిస్తున్నారని, దానికి తగినట్టుగా నాణ్యమైన విద్యనందించేందుకు ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఎక్కువ అనుబంధ కళాశాలలతో పెద్ద విశ్వ విద్యాలయంగా పేరుపొందిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివద్ధి పథంలో నడిపేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు. ఎటువంటి తారతమ్యాలు లేకుండా సమష్టి కషితో పని చేస్తేనే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివద్ధి చెందుతుందని అన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఎన్నో వనరులు, వసతులు ఉన్నాయని వాటిని ఉపయోగించుకుంటూ విశ్వవిద్యాలయాన్ని ముందుకు తీసుకువెళ్దామన్నారు. విశ్వవిద్యాలయ సిబ్బంది అంతా క్రమశిక్షణతో విశ్వవిద్యాల అభివద్ధే ధ్యేయంగా పని చేయాలన్నారు.. విశ్వవిద్యాలయం నుండి బయటకు వెళ్ళే విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సంపాదించుకొని తీసుకువెళ్లాలని అన్నారు. విశ్వవిద్యాలయ సిబ్బందికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తానని, సమస్యలను పరిష్కరిస్తానని తెలియజేసారు. అనంతరం విశ్వవిద్యాలయ కేంద్ర పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు మరియు అనుబంధ కళాశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాళ్లపూడి
విద్యా వైద్య రంగాలతో పాటు ఇంటి అవసరాల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తులను కుటుంబాలను ఆదుకోవడానికి సేవా సంస్థలతో పాటు వ్యక్తులు కూడా ముందడుగు వేయాలని మండల మానవతా శాఖ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. వైద్యపరంగా ఆపరేషన్ చేయించుకోవడం, అనారోగ్యం కారణంగా పనులకు వెళ్లలేకపోతున్న తాళ్లపూడి బిసి కాలనీకి చెందిన మొదలవలస రమణా సుజాత దంపతులకు వైద్య ఇంటి అవసరాల నిమిత్తం మండల మానవతా శాఖ రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేసింది. ఈ కార్యక్రమంలో సురేష్, సుబ్బారావు, సనపల రాజశేఖర్, రమేష్ రామారావు దుర్గాప్రసాద్ శ్రీనివాస్ సత్యనారాయణ గోవింద్ ఉన్నారు.

ఆదుకోవాలని 104 ఉద్యోగుల నిరసన

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న 104 ఉద్యోగులు

ప్రజాశక్తి- నల్లజర్ల
అందరికీ ఆరోగ్యాన్ని అందించేందుకు గ్రామ గ్రామానికీ పరుగులు పెడుతున్న తమను తక్షణమే ఆదుకోవాలని 104 ఉద్యోగులు శనివారం నిరసన తెలిపారు. ప్రకాశరావుపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ముగిసిన అనంతరం ప్లేకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు 104 ఉద్యోగులను కాంట్రాక్టు లేదా ఆప్కాస్‌లో కలిపి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. నెల జీతం మీదనే ఆధారపడి బతుకుతున్న చిరుద్యోగులమైన తమకు నెలవారీ అందాల్సిన జీతం కూడా సక్రమంగా అందకపోవడంతో అర్ధాకలితోనే తమ కుటుంబాలు కాలం గడుపుతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతినెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని, ఇప్పటివరకూ పేరుకుపోయిన వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని కోరారు. 104 పైలట్ బి.నరేష్, డిఇఒ జి.సుమలత ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్ మద్దతు తెలిపారు.

రోటరీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-నిడదవోలు
రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ ద్వారా వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు మిడ్ టౌన్ క్లబ్ సలహాదారులు గాలి రాఘవయ్య తెలిపారు. స్థానిక నిడదవోలు పట్టణ గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న గీతా ఐస్ పార్లర్ దగ్గర ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని అడ్డగర్ల అన్నపూర్ణ, చైతన్య ఆర్థిక సాయంతో ఏర్పాటు చేశారు. సుమారు 1000 మందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రెటరీ ఆకుల రాజీవ్, పి.ఫణిసింహ, ఇంజే శేఖర్, గల్లా రాజు, కొయ్యే నాగులు, ఆనందం మురళి తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-తాళ్లపూడి
ప్రతి వ్యక్తీ సంపూర్ణ ఆరోగ్యంతో జీవనం కొనసాగించాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో అది యోగాతోనే సాధ్యమని ఎం.సతీష్ అన్నారు. మానవత ఆధ్వర్యంలో తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల సందర్భంగా శనివారం జరిగిన యోగ కార్యక్రమానికి సతీష్ హాజరై విద్యార్థులకు యోగ యొక్క ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు ఎ.నరేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సంబరాలు

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణులు జిల్లావ్యాప్తంగా సంబరాలు చేసుకున్నాయి.

నిడదవోలులో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం
కొవ్వూరు రూరల్‌లో కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి అరిగెల అరుణ కుమారి ఎన్నికల్లో విజయంపై హర్షం వ్యక్తం చేశారు. **నిడదవోలులో** పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి పెద్దిరెడ్డి సుబ్బారావు, కారింకి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద స్వీట్లు పంపిణీ చేశారు. స్థానాపతి ఉషారాణి, చిన్నం మురళీకృష్ణ, అగర్వాల్ హీరాలాల్, జివివి.సత్యనారాయణ, కొణిజేటి వెంకటనారాయణ, జిల్లా కార్యదర్శి పెచ్చెట్టి కోటేశ్వరరావు, హుస్సేన్ షేక్ ఖాసిం, మహమ్మద్ అన్వర్ ఖాన్, పుచ్చకాయల ప్రసాద్, భావన రమేష్, గుర్రం రమేష్ పాల్గొన్నారు. **రాజానగరంలో** పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వైఎ. వడయార్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ముప్పిడి శ్రీను, డాక్టర్ వై.శ్రీనివాసరావు, రాజేష్, దాసరి లోవరాజు, బొత్స యేసు పాల్గొన్నారు. **సీతానగరం** కూనవరంలో అయిల శేషగిరి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. రంగాశ్రీను, దూలం అరుణ్ తేజ, శీలం రామకృష్ణ, పిర్ల సురేష్, మట్టా రాము, ఊడి వెంకట రత్నం పాల్గొన్నారు. **చాగల్లులో** కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి అరిగెల అరుణ కుమారి హర్షం వ్యక్తం చేశారు. చాగల్లు మెయిన్ బజార్లో భారీ ఎత్తున బాలసంచి కాల్చి స్వీట్లు పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో పాలకుర్తి ప్రభాకర్ చౌదరి, బి.రాంబాబు పాల్గొన్నారు.

సిహెచ్‌సిలో ఎంఎల్‌ఎ వెంకట్రావు తనిఖీలు

ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న ఎంఎల్‌ఎ వెంకట్రావు

ప్రజాశక్తి-గోపాలపురం
ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు శనివారం గోపాలపురం ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కొంతసేపు వైద్యులతో అక్కడ ఉండే సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఎల్‌ఎ విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉందన్నారు. ప్రస్తుతానికి డిప్యూటేషన్‌పై డాక్టర్లను రప్పిస్తామన్నారు. జనరేటర్‌కు సుమారు రూ.3,50,000 ఖర్చు అవుతుందని, ఎవరైనా దాతల చేత ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎక్సరే మిషన్ త్వరలో ఏర్పాటు చేస్తామని, మార్చురీ రూము మంజూరయ్యిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల సమయంలో గోపాలపురం సిహెచ్‌సిలో అందుబాటులో ఉండడంతో క్షతగాత్రులను ఇక్కడికి తరలిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైద్య, విద్యా రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని త్వరలో ఆసుపత్రికి కావలసిన వసతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

భూముల అక్రమాలపై విచారణ చేయాలి

ప్రజాశక్తి- గోకవరం
సుందరమ్మ సత్రం భూములు, పాండవుల మెట్ట భూముల అవకతవకలపై విచారణ జరిపి ప్రభుత్వానికి గండి కొట్టిన రూ.కోట్లను రికవరీ చేయాలని ఎపిఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రంపఎర్రంపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ 50 ఏళ్లుగా సుందరమ్మ సత్రం భూములు, పాండవుల మెట్ట భూములను కబ్జాదారులు అనుభవిస్తున్నారని తెలిపారు. ఆ భూముల్లో మామిడి, జీడిమామిడి, టేకు చెట్ల నుంచి వచ్చే ఆదాయం అధికారుల చేతులు మారుతున్నాయని ఆరోపించారు. సుందరమ్మ ట్రస్ట్‌ను రద్దు చేసి భూములకు బహిరంగ వేలం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కొత్తపల్లిలో వ్యాధి నియంత్రణ దినోత్సవం

ప్రజాశక్తి -గోకవరం
మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ దినోత్సవం కార్యక్రమం రాజమహేంద్రవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి సిహెచ్.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటూ వ్యాధులు సంక్రమణ కీటకాల ద్వారా వ్యాపించే వ్యాధులు, రక్త పరీక్షలు మలేరియా, డెంగ్యూ వంటి రాపిడ్ కిట్స్ గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఫీల్డ్ లెవెల్లో ప్రతి వైఎస్ఆర్ క్లినిక్‌లో రోగులకు అందుబాటులో ఉన్న వైద్య సేవలు అందించాలని ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ వైఎస్.రాయుడు, అశోక్ వర్ధన్, పవన్, రమణ ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

ఈ ఏడాది అన్నీ సాధారణమేరా..
ఒక్క ధరల పెరుగుదల తప్ప..!!

లోక్ అదాలత్‌లో 7,531 కేసుల పరిష్కారం

లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం
జిల్లాలోని 64 కోర్టుల్లో ఏర్పాటు చేసిన బెంచ్‌ల ద్వారా 7,531 పైగా కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా శనివారం పరిష్కరించారు. శనివారం స్థానిక కోర్టుల ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. సివిల్ తగాదాలు, రాజీ పడదగిన కేసుల పరిష్కారానికి చొరవ ఇన్సూరెన్స్ కంపెనీలు, న్యాయవాదులు, ఇతర శాఖల అధికారులు, ఇందులో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరి సేవలు అభినందనీయమని న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి యుయు.ప్రసాద్ ప్రశంసించారు. రాత్రి 7 .30 గంటల వరకూ కేసుల పరిష్కారం సాగుతోందన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో జాతీయ లోక్ అదాలత్ జరిగే రోజున పరిష్కారం కోసం వచ్చిన చివరి కేసు పరిష్కారం చూపే వరకు ఎంతసేపైనా వేచి చూసి సమన్యాయం కోసం న్యాయ మూర్తులు, న్యాయ వాదులు, ప్రతి ఒక్కరూ పని చేస్తామన్నారు. రాజీ ద్వారా కేసులు సత్వర పరిష్కారం సాధ్యం అవుతుందని, ఆ దిశలో ఇరు పక్షాలు రాజీ ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు న్యాయ మూర్తులు పేర్కొన్నారు. ఇందువల్ల సమయం, డబ్బు ఆదా అవ్వడం తోపాటు మంచి అనుబంధాలు ఆత్మీయతలు పెరుగుతాయని వారు పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం ద్వారా సత్వర న్యాయం జరిగేలా న్యాయ మూర్తులు, కోర్టులు పనిచేస్తాయని పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల్లో, కక్షిదారుల్లో లోక్ అదాలత్‌లపై మరింతగా అవగాహన పెంచి సత్వర న్యాయం కోసం సామాజిక బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. లోక్ అదాలత్ బెంచ్‌కు వచ్చిన కేసులకు పరిష్కారం చూపి అవార్డ్ వెల్లడిస్తామని తెలిపారు. జిల్లాలో 4 నూతన జిల్లాల (కాకినాడ, బిఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లా) పరిధిలో 43 బెంచ్‌లలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించామని పేర్కొన్నారు. పోక్సో, మర్డర్ వంటి కేసులు తప్ప, రాజీ ద్వారా పరిష్కారం అయ్యే అవకాశం ఉన్న కేసులకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పదో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎం.నాగేశ్వరరావు, 8వ అదనపు జిల్లా జడ్జి పిఆర్.రాజీవ్, ఫ్యామిలీ కోర్టు 9వ అదనపు జిల్లాలో జడ్జి ఎం.మాధురి, సీనియర్ జిల్లా జడ్జి డిఎల్ఎస్ఎ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యాయవాది జియువిబి రాజు, పలువురు న్యాయవాదులు, రవాణా శాఖ అధికారులు, డాక్టర్లు, ఇన్సూరెన్స్, టెలికాం కంపెనీ ప్రతినిధులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న పొగాకు బోర్డు సభ్యులు, రైతులు

పొగాకు రైతులకు సహకారం

ప్రజాశక్తి-గోపాలపురం
ఇటీవల వర్షాలకు నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకునేందుకు గోపాలపురం బోర్డు పరిధిలో రైతులు ముందుకు వచ్చినట్లు ఆర్ఎం రాజమహేంద్రవరం ఎం.ఆదిశేషయ్య తెలిపారు. శనివారం గోపాలపురం పొగాకు బోర్డు వేలం కేంద్రం వద్ద గోపాలపురం బోర్డు ఆక్షన్ సూపరింటెండెంట్ అమల్ డి.శామ్, పొగాకు బోర్డు మాజీ వైస్ చైర్మన్ గద్దె శేషగిరిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిశేషయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వడగండ్ల వర్షాలకు పొగాకు తోటలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, పంట నష్టపోయిన రైతులకు బాసటగా నిలిచేందుకు పొగాకు రైతులు ముందుకు వచ్చినట్లు తెలిపారు. నష్టపోయిన రైతులకు పొగాకు బేరన్‌కు రూ.200 చొప్పున తమ అమ్మకాల నుంచి మినహాయించేందుకు రైతులు నిర్ణయించినట్టు తెలిపారు. సీనియర్ గ్రేడ్ ఆఫీసర్ హేమస్మిత, పిన్నమనేని మోహన్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అత్త హత్య కేసులో కోడలు అరెస్ట్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

అత్తను హత్య చేసిన కోడలును పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పర్చగా ఆమెకు 14 రోజుల రిమాండ్‌ను న్యాయమూర్తి విధించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆత్రేయపురం దళితపేటలో నక్క మహాలక్ష్మి నివాసం ఉంటుంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పిల్లల ముగ్గురికీ ఆమె వివాహం చేసింది. కుమార్తెలు వారి అత్తారింట్లో ఉంటున్నారు. మహాలక్ష్మి కుమారుని వద్ద ఉంటోంది. ఇటీవల కాలంలో మహాలక్ష్మికి ఆమె కోడలు బుజ్జమ్మకు తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో అత్తను హతమార్చాలని బుజ్జమ్మ పథకం వేసింది. ఈనెల 9న ఇంట్లో నిద్రిస్తున్న అత్తను హత్య చేసింది. అనంతరం ఏమీ తెలియనట్టుగా వ్యవహరించింది. మహాలక్ష్మి కుమార్తెలు బుజ్జమ్మపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెను పోలీసులు అదుపులో తీసుకొని విచారించారు. హత్య చేసినట్లుగా అంగీకరించడంతో సిఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో ఆమెను శనివారం అరెస్ట్ చేసి కొత్తపేట కోర్టులో హాజరు పరిచారు. 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి అమలాపురం రూరల్

వ్యక్తి అదృశ్యమైనట్టు అమలాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ ఎ.పరదేశి తెలిపిన వివరాల మేరకు అమలాపురం మండలం ఎ.వేమవరం నామాలవారి పాలేనికి చెందిన వనచర్ల బాలవెంకట సత్యనారాయణ అలియాస్ చిన్ని(44) ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన సోదరుడు వనచర్ల శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. అతని వివరాలు ఎవరికైనా తెలిస్తే 9440796562, 08856231066 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జొన్నాడలో హిజ్రా దారుణ హత్య

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ పంట కాలువ చెంతన ఒక హిజ్రా హత్యకు గురైంది. హిజ్రా పశ్చిమగోదావరి జిల్లా మాధవరం మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన మరిపట్ల ఆనంద్(33)గా గుర్తించారు. ఘటనా స్థలాన్ని డిఎస్‌పి కె.వెంకటరమణ, రావులపాలెం సిఐ రజనికుమార్, ఎస్‌ఐ వెంకటరమణ శనివారం పరిశీలించారు. శుక్రవారం రాత్రి గుర్తితెలియని వ్యక్తులు హత్యచేసి పంటకాలువలో పడేశారని, స్థానికుల సమాచారంతో ఘటనా స్థలాన్ని పరిశీలించామని వారు తెలిపారు. వేలిముద్ర నిపుణులు, డాగ్ స్క్వాడ్ బృందం ఎస్‌ఐ ఎస్.శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆధారాలు సేకరించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల పంచాయతీ కొత్తూరుకు చెందిన మల్లాడి నూకరాజు(29) శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు కోరంగి పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం ఆందోళనకు దిగారు. కోరింగ ఎస్‌ఐ శ్రీనివాస్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరుకు చెందిన నూకరాజు కాకినాడ పోర్టులో కార్మికునిగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. శుక్రవారం రాత్రి కాకినాడ నుంచి కొత్తూరులో ఇంటికి తిరిగి వస్తుండగా లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు. దీంతో నూకరాజు కుటుంబం రోడ్డున పడింది. నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు కోరంగి పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం ఆందోళన చేశారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

వ్యక్తిపై కత్తెరతో దాడి

సీతానగరం : వ్యక్తిపై కత్తెరతో దాడికి దిగన ఘటన ఉండేశ్వరపురంలో చోటు చేసుకుంది. ఉండేశ్వరపురానికి చెందిన ఉప్పలపాటి శ్రీనివాసరావు కొద్ది కాలంగా భార్యతో గొడవపడి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉంటున్నాడు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద అపరిశుభ్రంగా ఉండటంతో అక్కడ ఉండొద్దని అదే గ్రామానికి చెందిన సింహాద్రి సురేష్‌బాబు పలుమార్లు శ్రీనివాసరావును హెచ్చరించాడు. సురేష్‌బాబు తల్లి అదే కేంద్రంలో అంగనవాడి టీచర్‌గా పని చేస్తుంది. శుక్రవారం కూడా శ్రీనివాసరావు అంగన్‌వాడీ కేంద్రం వద్దనే ఉండటంతో మరోమారు సురేష్‌బాబు హెచ్చరించాడు. అక్కడ నుంచి వెళ్లిపోవాలని చెప్పడంతో సురేష్‌బాబుతో శ్రీనివాసరావు గొడవపడ్డాడు. కత్తెరతో సురేష్‌బాబుపై దాడి చేశాడు. వెంటనే స్థానికులు సురేష్‌బాబును రాజమహేంద్రవరంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యుల సమాచారం మేరకు సీతానగరం హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు నిందితునిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేవారు. నార్త్ జోన్ డిఎస్‌పి కడలి వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోరుకొండ సిఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

కళ్లాల్లో ధాన్యం కళ్లల్లో దైన్యం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రహసనంలా మారింది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వానికి పూర్తిగా చిత్తశుద్ధి కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో అకాల వర్షాలతో ధాన్యం తడిచిపోయి, పంటను కోల్పోయి అన్నదాతలు పూర్తిగా నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకత్వం, టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జిల్లాలో పర్యటించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని లేనిపక్షంలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించి రైతుల పక్షాన నిలబడ్డారు. అధికార యంత్రాంగం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, పంట నష్ట పరిహారం చెల్లింపునకు ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ధాన్యం కొనుగోలు రైస్ మిల్లర్ల చేతి వాటానికి తూర్పుగోదావరి జిల్లాలో బ్రేక్ పడింది. తాలు, తేమ పేరుతో క్వింటాకు ఆరు కేజీల చొప్పున తరుగు తీసి నగదు వసూళ్ల చేయడంపై పలు ఫిర్యాదులందాయి. దీనిపై కలెక్టర్ మాధవీలత విచారణ నిర్వహించారు. రెండు రైస్ మిల్లులను సిఎంఆర్ నుంచి తొలగించారు. కోనసీమ, కాకినాడ జిల్లాల్లోనూ ఇప్పటికీ ఈ రకమైన దోపిడీ కొనసాగుతోంది. అధికారులు విచారణ చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరో వైపు జిల్లాలో నిర్వహిస్తున్న పంటనష్టం లెక్కింపు ప్రక్రియ సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.పూర్తిగా నష్టపోయిన పంటకు మాత్రమే ఎన్యుమరేషన్ జరుగుతోంది. సాంకేతిక కారణాలు సాకుగా చూపించి అధిక శాతం పంటను ఎన్యుమరేషన్ చేయటంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించి న్యాయం చేయాలని జిల్లా రైతాంగం విజ్ఞప్తి చేస్తోంది.

మహానాడుకు సమాయత్తం

టిడిపి ఎన్నికల శంఖారావం పూరించేందుకు తొలి అడుగు వేసింది. ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ఈ ఏడాది రాజమహేంద్రవరంలో మహానాడు నిర్వహించడం మరింత ప్రత్యేకత సంతరించుకుంది. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ ఇక్కడి నుంచే ఎన్నికల శంఖారావం పూరించి రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయం సృష్టించిన విషయం విధితమే. అదే స్ఫూర్తితో ఈ నెల 27, 28 తేదీల్లో వేమగిరిలో మహానాడు నిర్వహించేందుకు ఆ పార్టీ నాయకులు సన్నద్ధమయ్యారు. రాష్ట్రంలోని టిడిపి అభిమానులు, కార్యకర్తలతో పాటు దేశ విదేశాలనుంచి డెలిగెట్స్ తరలి రానున్నారని సమాచారం. సుమారు 10 లక్షల మందితో ముగింపు సభ నిర్వహించేందుకు సన్నాహకాలు చేస్తున్నామని ఆ పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు.

తండ్రి, తనయునికి బెయిల్

చిట్‌ఫండ్ కేసులో అరెస్టయి సెంట్రల్‌జైల్లో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, ఆయన తనయుడు, సిటీ ఎంఎల్‌ఎ భర్త ఆదిరెడ్డి వాసు ఎట్టకేలకు బెయిల్‌పై విడుదలయ్యారు. మహానాడు వేళ ఆదిరెడ్డి అరెస్టులు వేడిని పుట్టించాయి. అరెస్టులపై టిడిపి శ్రేణులు రోడ్డెక్కాయి. కావాలనే కక్షపూరితంగా అధికార పార్టీ అరెస్టులు చేయించిందని ఆరోపణలు గుప్పించాయి. చంద్రబాబు, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సైతం ఆదిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించాయి. ఎట్టకేలకు వారి విడుదలతో ఆ కేడర్‌లో మళ్లీ ఉత్సాహం ఉప్పొంగింది.

జిఒ 1 రద్దు మరో చెంపపెట్టు

ప్రజలు, ప్రతిపక్ష పార్టీల ప్రజా స్వామ్య హక్కులను కాలరాసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 1ను హై కోర్టు రద్దు చేయడం పాలక పక్షానికి చెంప పెట్టు అనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. సమస్యపై ప్రశ్నించిన ఉద్యోగులను, కార్మికులను వారి పక్షాన గొంతుకై పోరాడుతున్న పార్టీలపై ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరిస్తోంది. ముందస్తు అరెస్టులు, నిర్భంధాలతో నియంతలా వ్యవహరిస్తుంది. ఈ వైఖరిని కొనసాగించేందుకు జిఒ 1ను తీసుకొచ్చింది. దీనిపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. ప్రజలు, ప్రజా సంఘాలు ముక్త కంఠంతో వ్యతిరేకించి ప్రత్యక్ష ఆందోళనలతో పాటు చేసిన న్యాయ పోరాటం విజయం సాధించింది. ఈ జిఒను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది.

విద్యుత్ శాఖ 'సర్దు'పోటు

సర్దు బాటు ఛార్జీల పేరుతో విద్యుత్ శాఖ వినియోగదారుల నడ్డివిరుస్తోందని సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యుత్ ఛార్జీలు ఏడాదికి ఒకటి లేదా రెండు సార్లు పెరుగుతూనే ఉన్నాయి. ట్రూ అప్, అడిషనల్ ఛార్జీలు రక రకాల పేర్లతో గోళ్లూడపీకుతోంది. గతంలో ఎవరో వినియోగించిన కరెంటుకు ఇపుడు మేం ఎలా కడతామనే ప్రశ్న అద్దె దారుల నుంచి వ్యక్తమవుతోంది. విద్యుత్‌శాఖ నుంచి ఈ ప్రశ్నకు సమాధానం లభించడంలేదు. బిల్లులు చెల్లించకపోతే ఫీజులు తొలగిస్తామంటూ హెచ్చరికలు జారీ చేసి మరింత భయాందోళనలకు గురి చేస్తున్నారు. ఓ వైపు నిత్యావసర సరకుల ధరలు, పన్నుల భారాలు ఆకాన్నంటుతున్న విషయం విధితమే. సర్దుపోటుపై పాలనా యంత్రాంగం పునరాలోచించుకోపోతే మూల్యం చెల్లించుకోక తప్పదనే పలువురు హెచ్చరిస్తున్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం...

- పండిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం
- ఎపి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రారెడ్డి

ప్రజాశక్తి - కాకినాడ

సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రారెడ్డి

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నష్టపోయిన రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్ర రెడ్డి అన్నారు. శనివారం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాళ్వా సాగు చేతికందే సమయంలో అకాల వర్షాలు కారణంగా రైతుల తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఆర్బికేలు ద్వారా ప్రతి గింజ కొనుగోలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి దానికి ప్రత్యేక అధికారిని కూడా నియమించినట్టు తెలిపారు. ఆర్‌బికెల నుండి కొనుగోలు చేసిన ధాన్యాలు చెల్లింపులకు సంబంధించి ఒకటి నాలుగు నిష్పత్తి బ్యాంకు గ్యారంటీ సౌకర్యం రైస్ మిల్లర్లకు కలిగించినట్టు తెలిపారు. ప్యాడీ కి సంబంధించి తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయడానికి అలాగే బాయిల్డ్ రైస్ సంబంధించి ఐదు లక్షల టన్నులకు కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఆర్‌బికెల ద్వారా స్వీకరించిన ధాన్యం తిరిగి లెవీ రూపంలో ప్రభుత్వానికి అందజేయడంలో మన రాష్ట్రం ముందంజలో ఉందని తెలిపారు. సరిహద్దు రాష్ట్రం తెలంగాణలో 50 లక్షల టన్నులు బకాయిలు ఉన్నాయని వాటితో పోలిస్తే మన రాష్ట్రంలో సేకరించిన ప్రతి గింజ సద్వినియోగం చేయడం జరుగుతుందని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన ఈ కొత్త వ్యవస్థ ద్వారా రైతులు ఎవరూ మిల్లర్లను సంప్రదించాల్సిన అవసరం లేకుండా నేరుగా తమ ధాన్యాన్ని ఆర్ బి కే లకు అమ్ముకునే అవకాశం ఉందని అలాగే దళారీలను ఆశ్రయించొద్దని సూచించారు. దళారీ వ్యవస్థ పూర్తిస్థాయిలో నిర్మూలన చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధక్షుడు వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి, తూర్పుగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లమిల్లి బుల్లి మోహన రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్‌సిసితో క్రమ-శిక్షణ

- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వరరావు

ప్రజాశక్తి- పెద్దాపురం

ఎన్‌సిసితో విద్యార్థులకు దేశభక్తి, క్రమశిక్షణ, నిబద్ధత అలవడతాయని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి నామవరపు రాజేశ్వరరావు అన్నారు. స్థానిక నవోదయ విద్యాలయలో గత 12 రోజులుగా జరుగుతున్న ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్ ఐ డిఎస్ ఎస్ సి-2023 కొరకు ఎంపికైన క్యాడెట్ ల శిక్షణా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పర్ఫెక్ట్ పర్సనాలిటీకి ఎన్‌సిసి ఒక గొప్ప అవకాశం అన్నారు. క్రమ శిక్షణతో కృషి చేస్తే గొప్ప భవిష్యతుత ఉంటుందన్నారు. ఎటిసి 1 కమాండెంట్ కల్నల్ వివేక్ సావన్ గౌడర్ క్యాంపు గురించి ఆయనకు వివరించారు.

మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వరరావు

కార్యక్రమంలో కమాండర్ కల్నల్ రిషి, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి ,క్యాంపు అడ్జటెంట్ కిషోర్, 540 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

రానున్న మూడు రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

రానున్న మూడు రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్నా యని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు. సాధ్యమైనంత వరకూ ఎండలో బయటకు వెళ్లారాదన్నారు. తప్పని సరి పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

బిసిలకు జగన్ సర్కారు అన్యాయం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రాష్ట్రంలోని బిసిలకు జగన్ సర్కారు తీవ్ర అన్యాయం చేసిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, రజక, దాసరి, సాధికార కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ కాకినాడ రామారావు, బిసి సంఘం జిల్లా అధ్యక్షులు పైలా సాంబశివరావు అన్నారు. శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బిసిల సత్తా చాటాలన్నారు. జగన్‌ను గద్దె దింపేందుకు ప్రతి బిసి సోదరుడు నడుం బిగించాలన్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకూ పోరుబాట నిర్వహిస్తున్నామన్నారు. వీటిని విజయవంతం చేయాలన్నారు. అన్నదమ్ములుగా ఉండే బిసిలను జగన్ విడదీసి కార్పొరేషన్లు పెట్టారన్నారు. ఈ కార్పొరేషన్లకు రూపాయి కూడా ఇవ్వకుండా నాలుగేళ్ల పాటు కాలం గడిపేశారన్నారు. బిసిలకు న్యాయం చేసింది టిడిపి మాత్రమేనన్నారు. బిసిలు అభివృద్ధి చెందాలంటే టిడిపిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. జగన్ చేస్తున్న అన్యాయాన్ని అన్ని మండల నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పోరు బాట ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. వీటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పెంకే వెంకటేష్, శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నాయకుల సంఘీభావం



చిన్నకొత్తూరులో పర్యటిస్తున్న నానాజీ

నిబంధనలు సడలించాలి

ప్రజాశక్తి -కరప

ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలని రూరల్ జనసేన ఇన్‌చార్జ్ పంతం నానాజీ అన్నారు. శనివారం చిన కొత్తూరులో గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు అల్లు గంగాద్రి ఆధ్వర్యంలో జనం కోసం పవన్ -పవన్ కోసం మనం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటన చేస్తున్న నానాజీకి రైతులు గ్రామస్తులు సమస్యలు తెలిపారు. కార్యక్రమంలో అల్లు గంగాద్రి,చింత వెంకట్, బండారు మణికంఠ, రెడ్డి రాజు, సంజయ్, గోపి , బోగి బోగిరెడ్డి కొండబాబు, బండారు మురళి, గంగాధర్, యాళ్ల పండు, వెంకటేశ్వర్లు, రమణ, శిరంగు శ్రీనివాస్, తాటికాయల వీరబాబు, కరెడ్ల గోవింద్, రెడ్డిపల్లి కిషోర్ పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి

ప్రజాశక్తి - సీతానగరం

భార్యపై కత్తితో దాడి చేసిన ఘటన చీపురుపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. చీపురుపల్లికి చెందిన పెద్దె నాగమణి, భర్త పెద్దె అర్జున్‌కు మధ్య గొడవల నేపథ్యంలో కొంత కాలంగా వారు విడిగా ఉంటున్నారు. గొడవల నేపథ్యంలో నాగమణి గతంలో భర్తపై కేసు పెట్టింది. ఈ విషయమై కోపంతో శనివారం ఆమెపై అర్జున్ కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో నాగమణి మెడ, కుడిచేయి, వీపుపై గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, స్థానికులు ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎంజి. రాజు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని కోరుకొండ సిఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

ఖర్చులు త్రిపురాంతకస్వామికి ఎరుక

కళావిహీనంగా నీలకంఠేశ్వర ఆలయం
కల్యాణానికీ ఆలయానికి రంగులు కరువు
20 ఏళ్లుగా ఖర్చులు చెప్పని ఇఒ

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని శివల గ్రామంలో బాలా త్రిపుర సుందరి సమేత నీలకంఠేశ్వర త్రిపురాంతకస్వామి ఆలయానికి 13 ఎకరాలు పంట భూమితో పాటు ధూప దీప నైవేద్యాలకు మరో ఐదున్నర ఎకరాలు వెరసి మొత్తం 18 ఎకరాలు పంట భూములు ఉన్నాయి. గత 20 ఏళ్లగా దేవస్థానం ఇఒ సత్యనారాయణ జమా ఖర్చులు చెప్పడం లేదని కనీసం ట్రస్ట్ బోర్డు కు కూడా ఖర్చులు చెప్పడం లేదని గ్రామ సర్పంచ్ అనసూరి సాయి బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆల యానికి కనీసం రంగులు కూడా వేయలేద న్నారు. స్వామివారి కల్యాణానికి కూడా రంగులు వేయకపోవడంతో ఆలయం పాతబడిపో యినట్లు కళావిహీనంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పై అధికారులకు ఫిర్యాదు చేశానని ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు. ఎప్పటికైనా ఇఒ స్పందించి ఆలయం జమా ఖర్చులు తేల్చాలని ఆలయానికి రంగులు వేయించాలని ఆలయ అభివద్ధికి కషి చేయాలని గ్రామ సర్పంచ్ సూరిబాబుతో పాటు పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

రూ.4 లక్షల బకాయిలు అందాలి : ఇఒ

శివల దేవస్థానం ఇఒ ఎంవివి.సత్య నారాయణ ఆలయ ఖర్చులు పైన ఆదాయం పైన జమా ఖర్చులు 20 ఏళ్లగా చెప్పకపోవడంపై వివరణ కోరగా.. గ్రామంలోని రైతులు వద్ద నుంచి సుమారు రూ.4 లక్షలు బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలు వసూలైతేనే ఖర్చులు చెప్పడం వీలవుతుందని వివరించారు. అదేవిధంగా పండగలకు తానే స్వయంగా ఖర్చులు పెడుతున్నానని దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు బకాయిల వసూల్లో సహకరించాలని ఇఒ తెలియజేశారు. అదేవిధంగా రంగుల కోసం అంచనాలను వేశామని ఆమోదం కోసం చూస్తున్నట్లు ఆయన చెప్పారు.



త్రిపురాంతకస్వామి ఆలయం

యానాం వార్తలు

నవోదయలో నూరు శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - యానాం

ఉలిసి మోహిత శ్రీ సాయి హాసిని (93.8 శాతం)

యానాం పట్టణంలోని స్థానిక మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయంలో 10,12 వ తరగతి పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ టివిఎస్ ప్రకాష్‌రావు శనివారం తెలిపారు. సిబిఎస్ఇ బోర్డు శుక్ర వారం ఫలితాలను ప్రకటించగా పదవ తరగతి ప్రథమ స్థానంలో ఉలిసి మోహిత శ్రీ సాయిహాసిని 93.8 శాతం, యర్రంశెట్టి యోగ లక్ష్మి 92 శాతం, ద్వితీయ స్థానంలో జి దివ్యాన్స 89.4 శాతం, శ్రీ సాయి రాజు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. 12వ తరగతి ప్రథమ స్థానంలో మల్లాది శివకాశి 86.6 శాతం, ద్వితీయ స్థానంలో బి.లాస్య 85.6 శాతం, ఎల్.సాయి నాయుడు తృతీయ స్థానంలో నిలిచారన్నారు.ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు, అధ్యాపకులు అభినందించారు.

కేకును కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు దినేష్ తదితరులు

కాంగ్రెస్ సంబరాలు

కర్ణాటకలో విజయం పట్ల యానాంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షులు అర్ధాని దినేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బాణసంచా కాల్చారు. కేక్‌లు కట్‌చేసి పంచారు. స్వీట్లు తినిపించుకున్నారు. ఈ దినేష్ మాట్లాడుతూ త్వరలో పుదుచ్చేరి రాష్ట్రంలోని, యానాం నియోజవర్గంలోని కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామన్నారు. బిజెపికి కర్ణాటక ప్రజలు సరైన బుద్ధి చెప్పారన్నారు.రానున్న రోజుల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. దీనికి కర్ణాటక ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు.

యంత్రంతో కూల్చేస్తున్న మున్సిల్ ప్రహరీ

మున్సిపల్ కార్పొరేషన్ ప్రహరీ ధ్వంసం

భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి అట్టలఫ్యాక్టరీ- భీమ్‌నగర్ రోడ్డు ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యానాం పట్టణ పరిధిలో పలు ప్రభుత్వ కట్టడాలను అక్రమార్కులు ఛిద్రం చేస్తున్నప్పటికీ స్థానిక అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. స్థానిక స్ట్రాబోర్డు అట్టల ఫ్యాక్టరీ నుంచి భీమ్ నగర్‌కు వెళ్లే రహదారిలో గతంలో వంద మీటర్ల మేర లక్షల రూపాయల మున్సిపాలిటీ నిధులతో భారీ ప్రహరీని నిర్మించారు. ఇటీవలి అట్టల ఫ్యాక్టరీ స్థలాన్ని ఒక వ్యక్తి కొనుగోలు చేశాడు. దాన్ని లేఅవుట్‌గా మార్చారు. దీని కోసం అడ్డుగా ఉందని మున్సిపాలిటీ ప్రహరీని కూల్చేశాడు. దీనిపై స్థానికులు అధికారులకు పిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని వారు తెలిపారు. ఇదిలా ఉండగా శనివారం పొక్లెయినర్లు, భారీ వాహనాల రాకపోకలను నిర్వహించడంతో రహదారి మొత్తం ఛిద్రం అయ్యిందని స్థానికులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేకూర్చడంపై గవర్నకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

సరుకులు అందిస్తున్న అనిత

నిత్యావసర సరుకుల అందజేత

యానాంలో స్థానిక అంబేద్కర్ నగర్‌లో 35 ఏళ్లుగా నివాసం ఉంటున్న నీరుపూడి సత్యనారాయణ కుటుంబానికి స్థానిక నాయకురాలు దుగ్గదుర్తి అనిత ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను శనివారం అందించారు. సత్యనారాయణ రీజెన్సీ ఫ్యాక్టరీలో పనిచేసేవారని, ఫ్యాక్టరీ మూతపడడంతో కుటుంబం రోడ్డును పడిందని తెలిపారు. ఆయనకు కళ్లు కూడా సరిగా కనిపించట్లేదన్నారు. విషయం తెలుసుకున్న తాను పలువురి సాయంతో నిత్యావసర సరుకులు అందించామని తెలిపారు. ఆమె వెంట రొయ్య ప్రసన్నకుమార్, జయరాం, పైడికొండల రాజా, మోకా రామలక్ష్మి తదితరులున్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

జాతీయ రహదారి 216 పై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నట్లు కాకినాడ డిఎస్‌పి మురళీకృష్ణ తెలిపారు. చొల్లంగి నుంచి సుంకరపాలెం జంక్షన్ వరకు గల 6 పాయింట్లను శనివారం రాత్రి కాకినాడ రూరల్ సీ.ఐ. శ్రీనివాస్ కోరింగ ఎస్‌ఐ శ్రీనివాస్ కుమార్‌లతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మురళీకష్ణ మాట్లాడుతూ ప్రతి నాలుగు రోడ్ల కూడలిలోను తారు డబ్బాలు జిగ్‌జాగ్ రూపంలో ఏర్పాటు చేయాలని ఎస్‌ఐ శ్రీనివాస్ కుమార్ కు సూచించారు. శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కోరంగి ఎఎస్‌ఐ. సత్యనారాయణ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

NAME CHANGE

I, MOHAMMAD JAMEELA KHANAM, W/o.MOHAMMAD AZAZ ALI KHAN, Age : 47 Years, Resident at of D.No.2-8-2, Bukkapeta Road, Nidadavole, Nidadavole Mandal, E.G.Dist. Do hereby inform to the public that my Name JAMELA KHANAM(Old Name) has been changed MOHAMMAD JAMEELA KHANAM (New Name) for all transactions.

ప్రకటన

నా క్లయింట్ అయిన తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ వారిచే పద్మావతి నగర్ BA No. 176/2013-G5 గా అప్రూవల్ పొంది బిల్డర్‌గా "GK Royale" అను పేరుతో నిర్మించియున్న R.S. 406/2B Flats లో 3rd Floor Flat No. 402 నివసిస్తున్న కాపురస్తులు **యేలేశ్వరపు వెంకటశాస్త్రి గారు కుమారుడు యేలేశ్వరపు శ్రీ ఫణీంద్ర** ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియచేయునది ఏమనగా,

నా క్లయింట్ ది. 11-3-23 సం॥ తేదీన Schedule Flat తాలూకు ఆస్తి ఒరిసినల్ దస్తావేజు ది. 25-3-2015 తేదీన No. 3276/2015 గా రిజిష్టర్ కాబడిన దస్తావేజు తీసుకొని హౌస్ షిఫ్టింగ్ సందర్భములో సదరు సామానులతో పాటు మేము శ్రీరామ్ నగర్ Opposite సాయి వృద్ధాశ్రమము మారుచుండు సందర్భములో నా క్లయింట్ తాలూకా ఒరిజినల్ దస్తావేజులు ది. 25-3-2015, **దస్తావేజు నెం. 3276/2015** నెంబరు గలది తేది. 11-3-2023న జారి పడిపోయినది. సదరు దస్తావేజు ఎంత వెతికినను కనబడలేదు అని తెలిపినారు. సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాకు అందచేసి తగిన పారితోషికం పొందగలరు.

SIRIKI SRINIVASA RAO
Advocate
D.No. 2-12-12/2, A.C.Gardens
Rajamahendravaram
Cell: 9989362666